క్లుప్తంగా

వినతి

సీతంపేట: గిరిజన సంక్షేమ శాఖా మంత్రి జి.సంధ్యారాణికి పలు సమస్యలపై వినతి పత్రం ఇచ్చినట్లు పోస్టుమెట్రిక్ హస్టల్స్, ఆరోగ్య కార్యకర్తల రాష్ట్ర అధ్యక్షులు బి.రామ్మోహనరావు, సత్యనారాయణ, మోహపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఆశ్రమ వసతిగృహాల్లో పనిచేసిన ఆరోగ్య కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్లను తిరిగి విధుల్లోకి తీసుకోవడంతో పాటు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి న్యాయం చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పాండ్రసింగిలో చర్చి ప్రారంభం



చర్చి ప్రారంభోత్సవంలో పాల్గొన్న క్రైస్తవ మత పెద్దలు, పరీక్షిత్‌రాజు

జియ్యమ్మవలస: మండలంలోని పాండ్రసింగిలో నూతనంగా నిర్మించిన విశ్వవాణి ప్రార్థనా మందిరాన్ని (చర్చి) బుధశారం ప్రారంభించారు. ఈ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు హాజరయ్యారు. కార్యక్రమంలో క్రైస్తవ మతపెద్దలు పాల్గొన్నారు.

రికార్డులు తప్పనిసరి



వాహనదారుల రికార్డులు పరిశీలిస్తున్న ఏఎంవీఐ సత్యనారాయణ

గుమ్మలక్ష్మీపురం: వాహనదారులు అన్ని రికార్డులను కలిగి ఉండాలని పార్వతీపురం ఏఎంవీఐ జి. సత్యనారాయణ అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆటో, కమాండర్లు నడిపే డ్రైవర్ల రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం స్థానిక జీసీసీ పెట్రోల్ బంక్ ఆవరణలో వాహనదారులతో మాట్లాడుతూ .. వాహనదారులంతా విధిగా లైసెన్స్, సీబుక్, ఇన్సూరెన్స్ వంటి రికార్డులు దగ్గర ఉంచుకోవాలని సూచించారు.

పండ్ల తోటల పెంపకంపై దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం తులసీదాస్

భామిని: పండ్ల తోటల పెంపకంపై ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు దృష్టి సారించాలని ఉపాధి ఏపీఓ ఈ. తులసీదాస్ సూచించారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హార్టికల్చర్ సాగుపై అవగాహన కల్పించారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



ఇమ్యూనైజేషన్ పక్రియను పరిశీలిస్తున్న వెన్నెల

పాలకొండ : చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి వెన్నెల తెలిపారు. మండలంలోని కొండాపురం గ్రామంలో చిన్నారులకు ఇమ్యూనైజేషన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్యంపై తల్లులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జగదీష్, శ్రీనివాసరావు, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష సమావేశం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బొంగు సురేష్

జియ్యమ్మవలస : మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో ఎంపీపీ బొంగు సురేష్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల అవసరాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, టీడీపీ అరకు పార్లమెంటరీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, టీడీపీ మండల బాధ్యులు పల్ల రాంబాబు, ఎంపీడీఓ పి శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఏఈ జీవీ రఘు, తదితరులు పాల్గొన్నారు.

చదువుకుంటాం..
వసతి కల్పించండి

- గిరిజన విద్యార్థినుల డిమాండ్
- వసతిగృహంలో సీట్లు లేక ఇక్కట్లు



ఎస్టీ పోస్టుమెట్రిక్ వసతిగృహం వద్ద తమ పరిస్థితి వివరిస్తున్న విద్యార్థినులు, వారి తల్లితండ్రులు

పాలకొండ రూరల్: కష్టపడి చదువుకుంటాం.. వసతి కల్పించండని పలు మండలాలకు చెందిన గిరిజన విద్యార్థినులు కోరుతున్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పరిధిలో వీరఘట్టం, సీతంపేట, భామిని, హిరమండలంతో పాటు రామనగరం, చక్కపురం, తదితర ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు ఇటీవల పదో తరతగి పూర్తి చేసి ఇంటర్ విద్యలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే వీరంతా డివిజన కేంద్రమైన పాలకొండలో గల ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల్లో చేరాల్సి ఉంది. సమీప మండలాలకు చెందిన వీరు ప్రతిరోజూ వారి స్వగ్రామాలనుంచి వచ్చి చదువుకోవాలంటే చాలా ఇబ్బందులు తప్పవు. దాదాపు 60 నుంచి 80 కిలోమీటర్ల దూరం నుంచి రాకపోకలు సాగించడం అంత సులువు కాదు. ఈ క్రమంలో ప్రభుత్వ గిరిజన బాలికల సమీకృత వసతిగృహమే వీరికి ఆధారం.

పరిమిత సీట్లు కావడంతో..

పాలకొండలో గల ఎస్టీ పోస్టుమెట్రిక్ వసతిగృహం వద్దకు బుధవారం పలువురు విద్యార్థినులు తమ తల్లితండ్రులు, సంరక్షకులతో కలసి చేరుకున్నారు. కళాశాలల్లో చేరేందుకు వచ్చిన వీరు వసతిగృహంలో సీటు కోరి అక్కడకు వచ్చారు. అయితే వసతిగృహంలో ఉన్న పరిమిత సీట్లు అప్పటికే భర్తీ కావడంతో అక్కడి సిబ్బంది వసతి కల్పించలేమని స్పష్టం చేశారు. దీంతో విద్యార్థినుల తల్లితండ్రులు మాట్లాడుతూ.. తమ పిల్లలు చదువుల కోసం ప్రతి నిత్యం 80 కిలోమీటర్ల మేర ప్రయాణం చేసి కళాశాలకు రావడం, తిరిగి సురక్షితంగా ఇళ్లకు చేరడం వ్యయప్రయాసలతో కూడిన విషయమన్నారు.

గిరిజన సంక్షేమశాఖ, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి వసతి కల్పించేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. ప్రస్తుత వసతిగృహంలో సీట్లు లేనందున, పాలకొండలోనే ప్రత్యామ్నాయంగా వసతి కల్పించాలన్నారు. ఇదిలా ఉంటే స్థానిక ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లో ఇంటర్‌లో చేరేందుకు అవకాశం కల్పిస్తామని, వసతి మాత్రం విద్యార్థినులే ఏర్పాటు చేసుకోవాలని ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు స్పష్టం చేశారు.

అధికారులే చొరవ చూపాలి..

ఇంటర్‌లో చేరేందుకు పాలకొండ వచ్చాం. ఇక్కడి గిరిజన సంక్షేమ వసతిగృహంలో సీటు దక్కలేదు. ఉన్న సీట్లు ఇప్పటికే భర్తీ చేశామని చెబుతున్నారు. నేను మా గ్రామం నుంచి కళాశాలకు రావాలంటే రోజుకు 120 కిలోమీటర్లు ప్రయాణించాలి. లేదంటే చదువు మానేయాలి. కళాశాలలో సీటు దక్కినా వసతిగృహంలో అవకాశం లేకపోయింది. అధికారులే చొరవ చూపాలి.

– ఎస్.తేజశ్రీ, విద్యార్థిని, కారిగూడ, హిరమండలం

శతశాతం అవకాశం కల్పించాం

వసతిగృహంలో శతశాం విద్యార్థినులకు వసతి కల్పించాం. ప్రస్తుతం సీనియర్ విద్యార్థులే 140 మంది ఉన్నారు. మరో 60 మంది జూనియర్లకు నిబంధనల మేరకు సీట్లు కేటాయించాం. ఇకపై కొత్తవారికి అవకాశం కల్పించలేం. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి నిత్యం పదుల సంఖ్యలో గిరిజన విద్యార్థినులు వస్తున్నారు. ఇక్కడి పరిస్థితి వారికి వివరిస్తున్నాం. ఈ విషయం గిరిజన సంక్షేమశాఖ డీడీ దృష్టికి కూడా తీసుకువెళ్లాం. వారి సూచనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

– పి.రామలక్ష్మి, ఎస్టీ పోస్టుమెట్రిక్ వసతిగృహ అధికారి

సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, వైద్యసిబ్బంది

సీతంపేట: సికిల్‌సెల్ ఎనీమియా డే సందర్భంగా ఐటీడీఏ వద్ద బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐటీడీఏ ఏపీఓ ఎస్‌వీ గణేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐటడీఏ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో సంక్షేమ పాలన



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఎంపీపీ కుంబురుక దీనమయ్య

గుమ్మలక్ష్మీపురం: వైఎస్సార్‌సీపీ హయాంలో గత ఐదేళ్లలో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పాలన అందిందని ఎంపీపీ కుంబురుక దీనమయ్య అన్నారు. మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలను తీసుకువచ్చి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిందని చెప్పారు. అలాగే లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించిందన్నారు. అందుకుముందు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో గల వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మండంగి రాధిక, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గోరిశెట్టి గిరిబాబు, తోయక గోపాల్, సామల మాధవరావు, భోగాపుర ం నాగు, ఎస్.కృష్ణ, టి.పాపారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: బ్యాంకుల్లో అమలవుతున్న బీమా పథకాలను అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌బీఐ అధికారులు ప్రసాదరావు, వినోద్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీకు చెందిన విద్యార్థులకు ఆర్‌బీఐ అధికారులు డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు జీవిత బీమా, హెల్త్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్‌పై వివరించారు. అనంతరం విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ ఉన్నారు.

తలసేమియాపై ప్రచారం చేయండి

భామిని:

వంశపారంపర్య రుగ్మతగా వస్తున్న తలసేమియాగా పిలిచే సికిల్‌సెల్ ఎనీమియాపై మహిళా సంఘ సభ్యులకు అవగాహన కల్పించాలని వెలుగు సహాయ ప్రాజెక్ట్ డైరెక్టర్, వెటర్నరీ ఎ.డి సన్యాసినాయుడు తెలిపారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం దొడ్ల భవానీ అధ్యక్షతన నిర్వహించిన వీఓఏల నెలవారీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు, వీఓఏలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



మనుమకొండలో ప్రచార ర్యాలీ

అవగాహన ర్యాలీలు

భామిని: మండలంలోని మనుమకొండ, కాట్రగడ, బిల్లుమడ గ్రామాల్లో తలసేమిమా వ్యాధిపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధి నివారణకు తీసుకోవాల్సి జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమాల్లో బత్తిలి పీహెచ్‌సీ డాక్టర్ సన్యాసినాయుడు, ఏపీఓ డి.భవానీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో అధిక దిగుబడులు



నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న అప్పలనాయుడు

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ సాగులో భాగంగా నవధాన్యాలు సాగు చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అప్పలనాయుడు అన్నారు. మండలంలోని తోటపల్లిలో నవధాన్యాల సాగుపై మహిళలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవధాన్యాల సాగువల్ల భూమిలో సేంద్రియ కర్బనం పెరుగుతుందని చెప్పారు. దీనివల్ల భూమి గుల్లభారి ఎక్కువ కాలం తేమను నిల్వ చేసుకొనే అవకాశం ఉంటుందన్నారు. అలాగే మొక్కకు కావల్సిన నత్రజని, భాస్వరం, పొటాష్ పుష్కలంగా అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

వేడుకగా బంగారమ్మ తల్లి జాతర

పార్వతీపురం: మండలంలోని సంగంవలస గ్రామంలో బంగారమ్మ తల్లి అమ్మవారి జాతరను అత్యంత వేడుకగా నిర్వహించారు. మూడవ వార్షికోత్సవం సందర్భంగా బంగారమ్మ తల్లి అమ్మవారి జాతరను మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్నారు. గ్రామంలోని బడే వారి కుటుంబస్తులు ఈ జాతరను ఏటా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. బుధవారం అనుపోత్సవంలో భాగంగా అమ్మవారి ఘటాలను మేళతాళాలతో, డప్పువాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించి మొక్కులను చెల్లించుకున్నారు. ఈ పూజల్లో గ్రామస్తులంతా సామూహికంగా పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతం

సాలూరు: శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లక్ష్మి ఆప్టికల్స్ సహకారంతో సాలూరు పట్టణంలోని ఆర్యవైశ్య ధర్మశాలలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో 124 మందికి నేత్రపరీక్షలు చేయగా 62 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో నిర్వాహకులు వివేక్‌కుమార్, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

గడ్డి విత్తనాలు వేయవద్దు

- రైతులకు వ్యవసాయాధికారుల సూచన



రైతులతో సమావేశమైన వ్యవసాయ అధికారులు

సాలూరు రూరల్: మండలంలోని మరిపల్లి గ్రామంలో గడ్డి విత్తనాలు వేస్తున్నట్లు సమాచారం అందడంతో పొలంలో విత్తనాలు వేస్తున్న రైతులను వ్యవసాయ శాఖ అధికారులు ఏఓ అనూరాధ, ఏడీఏ మధుసూదనరావులు బుధవారం అడ్డుకున్నారు. అనంతరం గ్రామంలోని రామ మందిరం వద్ద రైతులతో సమావేశం ఏర్పాటు చేసి గడ్డి విత్తనాల వల్ల రాబోయే తరాలకు జరిగే నష్టాలను వివరించారు. గడ్డి విత్తనాలు పండించకూడదని దానివల్ల మానవాళి మనుగడకు నష్టం వాటిల్లుతుందని చెప్పారు. అలాగే ఈ విత్తనాలు ఎక్కడ కొన్నారని ఓ రైతును అడగ్గా ఒడిశా నుంచి వచ్చిన వారి వద్ద తెలియక కొనుగోలు చేసినట్లు తెలిపాడు. గడ్డి విత్తణాలు ఎవరైనా అమ్మితే తమకు సమాచారం ఇవ్వాలని రైతులకు అధికారులు సూచించారు.

వేతనం గిట్టుబాటయ్యేలా పనులు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అర్జునరావు

గరుగుబిల్లి: ఉపాధి వేతనదారులకు కనీస వేతనం గిట్టుబాటయ్యేలా చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్. అర్జునరావు ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పనుల్లో పాల్గొంటున్న వేతనదారుల మస్టర్లను ఎన్‌ఎంఎస్ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ ఎం. గౌరీనాథ్, సాంకేతిక సహాయకులు, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి..



సుబ్బారావు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సీతంపేట: చేసిన సేవలే గుర్తింపునిస్తాయని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. దోనుబాయి ఆశ్రమ పాఠశాల హెచ్ఎం కొండగొర్రె సుబ్బారావు ఉద్యోగ విరమణ సందర్భంగా దోనుబాయి గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సుబ్బారావు మాస్టారు ఎంతోమంది విద్యార్థులను ఉన్నతస్థాయికి తీసుకెళ్లారని కొనియాడారు. అనంతరం మాస్టారును సహచర ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వివిధ గిరిజన సంఘాల నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో ఐటీడీఏ, ట్రైబుల్ వెల్ఫేర్ అధికారులు, వివిధ ఆశ్రమపాఠశాలల హెచ్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్లు సద్వినియోగం చేసుకోవాలి..



విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేస్తున్న ఎంఈఓ, సర్పంచ్ తదితరులు

సీతంపేట: విద్యార్థులకు ఇస్తున్న స్టూడెంట్ కిట్లు సదినియోగం చేసుకోవాలని ఎంఈఓ డి.సూర్యచంద్రరావు అన్నారు. మండలంలోని పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగులు బుధశారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి చక్కగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ హెచ్.ఆదిలక్ష్మి, హెచ్ఎం ప్రసాద్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత నెల్లి సత్యంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ



ఉగాదినాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

పాలకొండ రూరల్: మండలంలోని బాసూరు గ్రామానికి చెందిన పొట్నూరు ఉగాదినాయుడు తీవ్ర అనారోగ్యం కారణంగా ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మృతుని స్వగ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ శిర్లాపు గురునాయుడు, వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్, సీనియర్ నాయకులు పాలవలస ధవళేశ్వరరావు, చంద్రమౌళి తదితరులున్నారు.

మొక్కలు నాటండి...



మాట్లాడుతున్న ఏపీడీ శ్రీహరిరావు

వీరఘట్టం: రానున్న వర్షాకాలంలో చెరువు గట్లు, రోడ్ల పక్కన, ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టాలని ఉపాధి ఏపీడీ జి. శ్రీహరిరావు సూచించారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఉపాధి ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 21న యోగా డే సందర్భంగా అమృత సరోవర్ పథకంలో భాగంగా ఎంపిక చేసిన చెరువుల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ ఎంవీబీ సుబ్రహ్మణ్యం, ఏపీఓ జి.సత్యంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందితో సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతాంజలి

సీతంపేట: ఉపాధి జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబం వంద రోజుల పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కె. గీతాంజలి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వంద రోజుల పనులు పూర్తి చేసుకున్న కుటుంబాలలో ఉన్న పిల్లలకు ఉన్నతి పథకం వర్తిస్తుందన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు స్థానిక వైటీసీలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రతీ పంచాయతీలో ఫార్మ్‌పాండ్ కట్టించడంలో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ సాగర్, ఈసీ పాండురంగ, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ చెల్లింపులపై అవగాహన తప్పనిసరి

- లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జేఎల్ఎన్ మూర్తి



నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పిస్తున్న లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జేఎల్ఎన్ మూర్తి

కురుపాం: ప్రతిఒక్కరూ డిజిటల్ చెల్లింపులపై అవగాహన కలిగి ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మూర్తి సూచించారు. గుమ్మలక్ష్మీపురం ఐటీఐ కళాశాలలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన రిజర్వ్ బ్యాంక్ అఫ్ ఇండియా, డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ కార్యశాలకు (వర్క్‌షాప్) ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నేడు ప్రతివ్యక్తీ డిజిటల్ బ్యాంకింగ్ వినియోగిస్తున్నారని.. ఎక్కడ చూసిన యూపీఐ పేమెంట్స్ ఎక్కువగా జరుగుతున్నాయని, ఇది చాలా మంచిదని తెలిపారు. అదేవిధంగా ఆన్‌లైన్ మోసాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయని, వాటి పట్ల అప్రమత్తత అవసరమని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. బ్యాంకింగ్‌కు సంబంధించి అవగాహన కార్యక్రమం కళాశాలలో ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. రిసోర్స్‌పర్సన్ ఫణికుమార్ మాట్లాడుతూ.. సంస్థ డైరెక్టర్ మేనేజర్ ఆంజనేయలు, అశోక్ పర్యవేక్షణలో ఈ వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టేట్‌బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సతీష్, సంస్థ ట్రైనర్లు వినోద్, కిశోర్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి: పశువులకు గొంతువాపు వ్యాధి రాకుండా ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు ఉల్లిభద్ర పశుసంవర్ధకశాఖ అధికారి సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని ఉల్లిభద్ర రైతుభరోసా కేంద్రం వద్ద పశువులకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాలను బుధవారం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో పశువులకు పలు రకాల వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. కలుషిత ఆహారం తినడం వల్ల, కలుషిత నీరు తాగడం వల్ల వ్యాధులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ సిబ్బంది ఎస్. శశికళ, పాల్గొన్నారు.